


ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సీతంపేట క్లస్టర్ ఉపాధి ఏపీడీ శ్రీహరిరావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఆయన మాట్లాడుతూ.. గరుగుబిల్లి, పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాల పరిధిలో ఈ నెల 25లోగా గుంతలు తీయించాలన్నారు. జూలైలోగా మొక్కలు నాటాలని సూచించారు. 3,265 ఫాంపాండ్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 5 వేల ఎకరాల్లో కొబ్బరి మొక్కల పెంపకానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆదిలోనే ఆటంకాలు

- ముంచుకొచ్చిన ఖరీఫ్ కాలం
- ముందుకు సాగని పనులు
- అధిక వర్షాలతో పుడమి జల్లపై పడని విత్తనాలు
- ప్రతికూల వాతావరణంతో తలలు పట్టుకుంటున్న రైతులు



అధిక వర్షాలతో వెలగవాడలో బురదమయంగా ఉన్న పంట పొలం

పాలకొండ, జూన్18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పనులకు ఆది నుంచే ఆటంకాలు ఎదురవుతున్నాయి. అధిక వర్షాలు రైతులను కలవరపరుస్తున్నాయి. ఖరీఫ్ కాలం ముంచుకొచ్చినా వ్యవసాయ పనులు మాత్రం చేపట్టలేకపోతున్నారు. ప్రతికూల వాతావరణంతో విత్తనాలు కూడా వేయలేకపోతున్నారు. ఏటా మే నెలలో వేసవి దుక్కులను పూర్తి చేసి జూన్ నెలలో మృగశిర కార్తె ప్రారంభం నుంచి ఖరీఫ్ విత్తనాలను జల్లుకొనేవారు. వరితో పాటు పత్తి, మొక్కజొన్న, చిరుధాన్యాలు ఇతర వాణిజ్య పంటలకు విత్తనాలకు సిద్ధం చేసుకునేవారు. మృగశిర, ఆరుద్ర కార్తెల్లో 80 శాతం వరకు రైతులు విత్తనాలు వేసేవారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలు కురిసేవి. దీంతో విత్తనాలు మొలకెత్తేవి. అయితే ఈ ఏడాది వేసవి అంతా వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనులు ముందుకు సాగలేదు. నారుమడుల్లో కలుపు అధికంగా పెరగ్గా భూమి పదును ఇవ్వకపోవడంతో దుక్కులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. అసలు విత్తనాలు వేసేందుకు అవకాశాలు లేకపోతుండడంతో ఖరీఫ్ పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

2.20 లక్షల ఎకరాల్లో సాగు...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 15 మండలాల్లో 2.20 లక్షల ఎకరాల్లో వరితో పాటు వివిధ రకాల పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయాధికారులు సమాయత్తమయ్యారు. 1.79 లక్షల ఎకరాల్లో వరి, 30 వేల ఎకరాల్లో ఎద పద్ధతిలో వరి సాగు చేయనున్నట్టు వారు అంచనా వేశారు. 18 వేల ఎకరాల్లో చిరు ధాన్యాలు, సుమారు 15 వేల ఎకరాల్లోని మెట్ట ప్రాంతాల్లో పత్తి, మరికొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు చేపట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

కూలీల కొరత ...

ఖరీఫ్‌లో అధికంగా వేసే వరి పంటకు కూలీల అవసరం ఎక్కువగానే ఉంటుంది. అయితే ఈ ఏడాది వాతావరణ ప్రతికూల పరిస్థితులతో ఖరీఫ్ పనులన్నీ ఒకేసారి ప్రారంభమయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పనులన్నీ ఒకేసారి జరిగితే కూలీల కొరత ఏర్పడక తప్పదు. డిమాండ్ దృష్ట్యా వారు అధిక కూలిని డిమాండ్ చేస్తే రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

వేసవి పంటలను కోల్పోయి...

ఈ ఏడాది రబీ పంటలు పూర్తయిన తర్వాత జిల్లాలోని కొంతమంది రైతులు వేసవి పంట కింద నువ్వు, పెసర, మినుమును సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల ఎకరాల్లో ఆయా పంటలు వేశారు. అయితే మే, జూన్ నెలల్లో కురిసిన అధిక వర్షాలతో రైతులు ఆయా పంటలను కోల్పోయారు. నువ్వు పంట చిగురించగా, మినుము, పెసరను కోసే పద్ధతి లేకపోవడంతో పొలంలో ఎరువుగా వినియోగించేందుకు మళ్లీ దుక్కులు దున్నారు. మరికొంతమంది రైతులు నీరు పెట్టి దమ్ము చేపట్టారు. ఇలా ఈ ఏడాది రైతులు విభిన్న వాతావరణ పరిస్థితులతో వేసవి పంటను కోల్పోయారు.

పది శాతం కూడా విత్తనాలు వేయలే..

ఏటా జూన్ మొదటి వారంలోనే పత్తి , మొక్కజొన్న, ఇతర చిరుధాన్యాల పంటల విత్తనాలను రైతులు జల్లేవారు. అయితే ఈ ఏడాది వాతావరణ ప్రతికూల పరిస్థితులతో ఆ పనులేవీ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఇంతవరకు పది శాతం కూడా ఏ రకమైన విత్తనాలు రైతులు విత్తలేకపోయారు. అధిక వర్షాల కారణంగా విత్తనం కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సాగునీరు పూర్తిస్థాయిలో అందకపోతే నారు మడులకు నష్టం కలిగే అవకాశం ఉందని యోచిస్తున్నారు.

విత్తనాలు, ఎరువుల పంపిణీకి సిద్ధం



తంపటాపల్లిలో..

గరుగుబిల్లి: జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 26,470 క్వింటాళ్ల మేర పలు రకాల విత్తనాలను సిద్ధం చేశారు. రాయితీపై వాటిని సరఫరా చేయనున్నారు. గిరిజనులకు 90 శాతం రాయితీతో 9,092 క్వింటాళ్ల మేర అందించనున్నారు. చిరుధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, పచ్చిరొట్ట ఎరువులు

(మిగతా 8వ పేజీలో...)

పఠనంతో విజ్ఞానం

- ఆలోచనా శక్తి, సృజనాత్మకతకు దోహదం
- భాష, సాహిత్యంపైనా పట్టు



సాలూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెరుగుతుంది. అక్షర జ్ఞానంతో పాటు భాష, సాహిత్యంపై మక్కువ ఏర్పడుతుంది. భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. గ్రంథాయాల్లో పఠించి ప్రభుత్వ కొలువులు సాధించిన వారెందరో ఉన్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో యువతకు పఠనాసక్తి పెంపొందించడంలో గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న 40 శాఖ గ్రంథాలయాల్లో రోజుకు 4వేల మంది వివిధ పుస్తకాలు, పత్రికలు పఠిస్తున్నారు. విజ్ఞానంతో పాటు సామాజిక అభివృద్ధికి పుస్తక, పత్రికల పఠనం ఎంతగానో దోహదపడుతుందని పలువురి అభిప్రాయం. అయితే నేటి డిజిటల్ యుగంలో గ్రంథాలయాలకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. నేటి తరం పూర్తిగా సెల్‌ఫోన్లు, కంప్యూటర్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ పఠనం సైతం ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. పఠనాసక్తిని పెంపొందించడానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకారమందిస్తే సత్ఫలితాలు సాధించొచ్చని పలువురు భావిస్తున్నారు.



నేడు 'జాతీయ పఠన దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 6లో

యోగాతో మానసిక ప్రశాంతత

- జిల్లా దేవదాయశాఖ అధికారి రామారావు



తోటపల్లి దేవస్థానం ఆవరణలో ఆసనాలు వేస్తున్న దృశ్యం

6లో

రహదారిపైనే వరదనీరు



6లో

ఎంటీఎస్‌ల బదిలీలకు చర్యలు

సాలూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని పాఠశాల విద్యా డైరెక్టర్ విజయ రామరాజు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2008, 1998 డీఎస్సీలకు చెందిన 480 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వారి బదిలీల నిమిత్తం ఇప్పటికే ఎంటీఎస్‌ల సీనియార్టీ జాబితాను ప్రకటించారు. ఈ బదిలీల్లో తొలుత 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు ప్రాధాన్యమివ్వనున్నారు. నిబంధనల మేరకు ఈ నెల 20 నాటికి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న 34 మండలాల ఎంఈవోలు ఈ మేరకు కసరత్తు చేస్తున్నారు. ఎంటీఎస్‌లకు బదిలీల ప్రక్రియ గురు,శుక్రవారాల్లో చేపట్టే అవకాశాలున్నాయి.

పూర్ణపాడు-లాబేసు వంతెనకు మోక్షం

- పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం చర్యలు
- రూ.5.25 కోట్లు మంజూరు
- వెల్లడించిన విప్ జగదీశ్వరి

కురుపాం, జూన్18(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెనకు మోక్షం కలిగింది. దీని పెండింగ్ పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5.25 కోట్లు మంజూరు చేసినట్లు విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచినట్లు చెప్పారు. కురుపాంలో బుధవారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ.. 'గత వైసీపీ ప్రభుత్వం పూర్ణపాడు-లాబేసు వంతెనపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సుమారు 80 పనులు చేయగా.. వైసీపీ సర్కారు కనీసం 20 శాతం పనులు కూడా పూర్తిచేయించలేకపోయింది. దీంతో ఎంతోమంది గ్రామస్థులు ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తారు. దీనికి సంబంధించి అప్రోచ్ రోడ్లు కోసం రూ.కోటి 80 లక్షలతో ప్రతి పాదనలు పంపించాం. ఏడాది కాలంలో ప్రభుత్వం నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రహదారుల బాగుకు సుమారు రూ. 13 కోట్లు వెచ్చించింది. ఏనుగుల జోన్ ఏర్పాటుతో పాటు జిల్లాకు రెండు కుంకిలను కేటాయించారు.' అని తెలిపారు. టీడీపీ నాయకులు కొండయ్య, చిరంజీవి, వెంకటనాయుడు, రాంబాబు, పురుషోత్తమరావు పాల్గొన్నారు.



టెండర్ల నోటీసును చూపుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

అద్వితీయం

- అన్నదాత సుఖీభవ ఈకేవైసీ నమోదులో జిల్లాకు రెండో స్థానం
- 21న రైతులకు తొలి విడత సాయం జమయ్యే అవకాశం

సాలూరు రూరల్,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులతో ఈకేవైసీ చేయించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు అర్హులుగా 1,18,274 మంది రైతులను గుర్తించారు. వారందరికీ ఈ నెల 20లోగా ఈకేవైసీ చేయించాలని ఆదేశాలున్నాయి. అయితే బుధవారం నాటికి 1,15,755 మంది రైతులతో ఈకేవైసీ చేయించారు. గడువు లోగా జిల్లాలో ఈ ప్రక్రియ 98 శాతం పూర్తికానుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. కాగా ఈకేవైసీ పూర్తిలో విశాఖపట్నం అర్బన్ తొలిస్థానంలో నిలవగా.. మన్యం జిల్లా రెండో స్థానం దక్కించుకుంది. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు ఈ నెల 21న తొలి విడత సాయం అందే అవకాశముంది. ప్రధానమంత్రి కిసాన్ సాయం రూ. 6వేలు కలుపుకుని అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.14 వేలు కూటమి ప్రభుత్వం అందించనుంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. తొలి విడత సాయం కింద రూ.7 వేలు జమ చేయనున్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లోని చెక్‌స్టేటస్‌లో ఆధార్ నెంబర్ నమోదు చేసి అర్హత పొందారో లేదో తెలుసుకోవచ్చు.

సాలూరు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

8లో

కురుపాంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

8లో

సాగు పరికరాలు

రైతులందరికీ ఉపయోగపడాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

పార్వతీపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీతో పొందిన వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులందరికీ ఉపయోగపడాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సాగు పరికరాలు, రాయితీ నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.514.09 లక్షల విలువైన యంత్ర పరికరాలను 50 శాతం రాయితీతో రూ.227.72 లక్షలకు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. లాభసాటి పంటలైన మొక్కజొన్న కందులు, చిరుధాన్యాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వ్యవసాయ విధానాలు, శ్రీవరిసాగు, చిరుధాన్యాలు, కంది, ప్రకృతి వ్యవసాయంపై ఉత్తమ రైతులతో మిగతా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 920 మంది చిన్న, సన్నకారు, గిరిజన రైతులకు రూ.2.27 కోట్ల రాయితీ నిధుల చెక్కును అందించారు. కందులు, ఎంటీయూ 1426 సన్నరకం వరి విత్తనాలు, మినీ కిట్లును రైతులకు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ.. కర్షక్ పోర్టల్ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించి వ్యవసాయ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. వ్యవసాయ పరికరాలను రైతు సేవా కేంద్రాల వద్దే అన్నదాతలకు అందించినట్లు తెలిపారు. పరికరాలకు మరమ్మతులు, సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఆగ్రో సంస్థ జిల్లా మేనేజర్ శంకర్‌బాబుకు సూచించారు. రాయితీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

డయేరియా మరణాలు సంభవించరాదు..

జిల్లాలో డయేరియా మరణాలు సంభవించరాదని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన

(మిగతా 8వ పేజీలో...)

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో

మెరిసిన మన్యం

- 10 బహుమతులతో రెండో స్థానం
- సత్తాచాటిన జిల్లావాసులు

పార్వతీపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో జిల్లావాసులు సత్తాచాటారు. జిల్లా పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయికి వెళ్లిన వారు మొత్తంగా 10 బహుమతులు సాధించి మన్యాన్ని ద్వితీయ స్థానంలో నిలబెట్టారు. ఈ నెల 16, 17 తేదీల్లో 13 విభాగాల్లో యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో 10 విభాగాల్లో జిల్లావాసులు విజేతలుగా నిలిచారు. మూడు ప్రథమ , రెండు ద్వితీయ , ఐదు తృతీయ బహుమతులను దక్కించుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు మంత్రులు సత్యకుమార్ యాదవ్, దుర్గేష్ బహుమతులు అందించారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కూడా వారిని అభినందించారు. జిల్లా నుంచి నోడల్ అధికారిగా వెళ్లిన గిరిజన సంక్షేమ శాఖాధికారి కృష్ణవేణి, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ రఘు, ఆయుష్ డిపార్ట్ మెంట్ కన్వీనర్ వర్మ, యోగా గురువు మోహన్ గంట తదితరులు విజేతలకు అన్నింటా అండగా నిలిచారు.

విజేతలు వీరే...


- యోగా సోలో (19నుంచి 35 సంవత్సరాలు) విభాగంలో జిల్లాకు చెందిన సీహెచ్ దీపక్‌నాయుడు,

(మిగతా 8వ పేజీలో...)



యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా వాసులు

పఠనం.. నడిపించే మంత్రం



- పుస్తకాలు.. పత్రికలతో విజ్ఞానం
- నేడు జాతీయ పఠన దినోత్సవం

సాంకేతికత ఎంత పెరిగినా.. సమాచారం ఎంతగా అరచేతిలోకి వచ్చేస్తున్నా... 'పఠనం' వల్ల కలిగే ప్రయోజనాన్ని తగ్గించలేవు. పుస్తకాలు.. పత్రికల పఠనం ద్వారా వచ్చే విజ్ఞానాన్ని తూకం వేయలేం. ప్రపంచంలో అత్యున్నత స్థానాలలో ఉంటున్న వారంతా తమ విజయంలో పఠనమే కీలకం అని చెబుతున్న సందర్భాలు ఎన్నో. సెల్‌ఫోన్ ఎంత సమాచారాన్ని ఇస్తున్నా.. ఇప్పటికీ పుస్తక పఠనంపై ఆధారపడేవారు ఎందరో. నేడు జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా.. పఠనం ప్రాముఖ్యాన్ని.. పఠనాన్ని వ్యసనంగా మార్చుకున్న కొందరి గురించి తెలుసుకుందాం.

సాలూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి)

'పఠనంతోనే జ్ఞానం, విజ్ఞానం వస్తుంది. చదవండి... అభివృద్ధి చెందండి...అనే కార్యక్రమాన్ని ప్రోత్సహించాల'ని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. 'బుక్స్ ఆర్ విండో ఆఫ్ వరల్డ్' అనే నానుడి ఉంది. దీన్ని బట్టి పఠనం ప్రయోజనమేంటో తెలుసుకోవచ్చు. పఠనంతో జ్ఞానం రావడమే కాకుండా సమాచార నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. దీని ప్రాధాన్యాన్ని తెలియజెప్పేందుకే 'జాతీయ పఠన దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు.

ఎలా వచ్చిందంటే..

జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని భారత గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పుతువాయిల్ నారాయణ పనికర్ వర్ధంతి రోజైన జూన్ 19న నిర్వహిస్తున్నారు. ఇది 1996 నుంచి ఆరంభమైంది. కేరళలో అక్షరాస్యత పెంపొందించే దిశగా ఆయన గ్రంథాలయాలు స్థాపించి పఠన ఆవశ్యకత ఉద్యమం చేపట్టారు. ఆయన 1995 జూన్ 19న తుదిశ్వాస విడిచారు. ఈ తేదిని జాతీయ పఠన దినోత్సవంగా కేంద్రప్రభుత్వం ప్రకటించింది.

ప్రస్తుత పరిస్థితి..

ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో మొబైల్, కంప్యూటర్‌లదే ఆధిపత్యం. పుస్తక పఠనం ప్రయోజనాలను వివరించాల్సిన తరుణమిది. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వృద్ధి తదితర ప్రయోజనాలను వివరించడమే లక్ష్యంగా జాతీయ పఠన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందుకు గ్రంథాలయాలు ప్రత్యేక పాత్రను పోషిస్తున్నాయి. యువత గ్రంథాలయాలను వినియోగించుకుంటే ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చు.



పాచిపెంట శాఖా గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థినులు

బంగారు భవిష్యత్తు..

గత 17 ఏళ్లుగా లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నాను. గ్రంథాలయానికి రోజూ వచ్చి చదువుతున్నవారు ఏదో ఒక కొలువు సాధిస్తున్నారు. పాచిపెంటలో నాకు తెలిసి ఇప్పటి వరకు 18 మంది వివిధ కొలువులు సాధించారు. ఇక్కడ చదవడం వల్లనే ఉద్యోగం వచ్చిందని వారు చెబుతుంటే చెప్పలేని ఆనందంగా ఉంటుంది.

-కె.ఉదయభాస్కర్, లైబ్రేరియన్, పాచిపెంట శాఖాగ్రంథాలయం

పుస్తకాలతో యువ వైద్యుడి ప్రయాణం..

బొబ్బిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని నాయుడు కాలనీకి చెందిన డాక్టర్ గునుపూరు హేమంత్ కుమార్ అనే యువకుడు ఇటీవల వైద్య విద్యలో పీజీ కోర్సును పూర్తి చేశాడు. ఆయనకు తెలుగు సాహిత్య పుస్తకాల పట్ల మక్కువ ఎక్కువ. హేమంత్ కుమార్ తల్లిదండ్రులు అప్పలనాయుడు, తిరుపతమ్మలు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వారు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేయించారు. అది తనకు సాహిత్యంపై ఇష్టాన్ని పెంచాయని హేమంత్ చెబుతారు. ఆయనను కదిపితే అలవోకగా కవులు, రచనలు, సూక్తులను వివరిస్తుంటారు.

దురలవాట్లకు అవకాశం ఉండదు..



పుస్తక పఠనాన్ని హాబీగా చేసుకున్న వారు వేరే వ్యాపకం పెట్టుకోలేరు. దురలవాట్ల వైపు తొంగి చూడలేరు. పుస్తక పఠనాన్ని జీవనవిధానంలో తప్పనిసరి చేసుకోవాలన్నది నా అభిప్రాయం. మహనీయుల కలాల నుంచి జాలువారిన మంచి మాటలను ఆచరించాలన్న తపనను పెంపొందించుకున్నాను. నాలాగనే నేటి తరం, రేపటి తరం వారు కచ్చితంగా పుస్తక పఠనాసక్తిని పెంచుకోవాలి. భగవద్గీత, సంపూర్ణ రామాయణం, మహాభారతం, సుందరకాండ వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను చదువుతుంటాను.

-డాక్టర్ హేమంత్‌కుమార్, బొబ్బిలి

పుస్తక పఠనంతో పరిణతి వచ్చింది..



నా వయస్సు 65 సంవత్సరాలు. నేను మూడు, నాలుగు దశాబ్దాల నుంచి పుస్తక పఠనం చేస్తున్నాను. అంబేడ్కర్ పోరాట సమితిలో సాహిత్య విభాగాన్ని ఏర్పాటు చేశాం. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సామాజిక ఉద్యమ నేత జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రలను ఔపోసన పట్టాను. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి ఘట్టాలపై సంపూర్ణ అవగాహన పొందగలిగాను. ఇదంతా పుస్తక పఠనంతో సాధ్యమైంది. సాహిత్యగోష్ఠులు, పుస్తక పరిచయాల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

-సోరు సాంబయ్య

'శంకర శతకం' పుస్తకావిష్కరణ..

పాలకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సంస్కృత పండితులు బౌరోతు శంకరరావు రచించిన 'శంకర శతకం' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యాల అభివృద్ధికి కృషి చేస్తున్న శంకరరావు రచించిన 'శంకర శతకం' అందరూ చదవాలని సూచించారు. కవి, రచయిత బౌరోతు శంకరరావు మాట్లాడుతూ వాడుక భాషలో శతకాన్ని రచించినట్టు చెప్పారు. సమాజంలో అన్ని రంగాల్లో నడుస్తున్న చరిత్రను తేటగీతి పద్యాల్లో రచించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శంకర శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

యోగాతో మానసిక ప్రశాంతత



తోటపల్లి దేవస్థానం ఆవరణలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా దేవదాయశాఖ అధికారి ఎస్.రామారావు అన్నారు. బుధవారం తోటపల్లి శ్రీ వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల ఆవరణలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను దిన చర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ యోగాపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దీని ఉపయోగాలను ప్రభుత్వ పాఠశాలలు, సంస్థల పరిధిలో వివరిస్తున్నామని తెలిపారు. ఈ నెల 21న విశాఖలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి ఈ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. వీరఘట్టం, పాలకొండ రుషిపీఠం సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది, ఆలయ అభివృద్ధి ట్రస్ట్ ప్రతినిధులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

చినబగ్గ టేకు తోటల్లో ఏనుగులు

సీతంపేట రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చినబగ్గ టేకు తోటల్లో గజరాజులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో సంచరిస్తున్న గజరాజుల ఘీంకారాలతో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బుధవారం ఏనుగులు తిష్ఠవేసిన టేకు ప్లాంటేషన్ ప్రాంతాన్ని పాలకొండ ఎఫ్ఆర్‌వో రామారావు సిబ్బందితో కలిసి పరిశీలించారు. బిల్లమడ, సుందరయ్యగూడ కాలనీ, పులిఘట్టి, జి.గుమ్మడ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు ఏనుగుల సంచారంపై అప్రమత్తం చేశారు. రాత్రి సమయాల్లో గిరిజనులు ఎవరూ ఆరుబయట తిరగవద్దని సూచించారు. ఏనుగులకు దగ్గరగా వెళ్లడం, ఫొటోలు తీయడం, కవ్వింపులకు పాల్పడడం చేయరాదన్నారు. సెక్షన్ అధికారి హరికృష్ణ, బీట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ట్రాకర్లు ఉన్నారు.



ఏనుగులు సంచరిస్తున్న పరిసరాల్లో అటవీ సిబ్బంది



మడ్డువలస రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

జూలై రెండో వారంలో నీరు విడుదల

- మడ్డువలస రిజర్వాయర్‌ను సందర్శించిన ఎస్‌ఈ

వంగర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో మడ్డువలస రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా నీటి విడుదలకు అంతా సిద్ధంగా ఉండాలని మడ్డువలస ఎస్‌ఈ ఆర్.అప్పారావు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం మడ్డువలస రిజర్వాయర్‌ను ఆయన సందర్శించారు. ముందుగా స్పిల్‌వే గేట్లు, రోప్‌లు విద్యుత్ తదితర వాటిని పరిశీలించారు. మడ్డువలస రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో ఖరీఫ్‌లో 6 మండలాల్లో 30 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రిజర్వాయర్ లోతట్టు ప్రాంతాల నిర్వాసితుల పట్ల సమస్యలు కారణంగా పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేయలేకపోతున్నామన్నారు. ఖరీఫ్ పంటలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా నీరు ఇవ్వగలుగుతామన్నారు. జూలై రెండో వారంలో నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రిజర్వాయర్‌లో నీటి నిల్వ వివరాలను కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. డీఈ రమణ, ఏఈ నితిన్, జగదీశ్ ఉన్నారు.

రైతు.. రాజయ్యే రోజులు రానున్నాయి

- వ్యవసాయాన్ని పండుగ చేసుకునేలా కార్యాచరణ
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొబ్బిలి/రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో రైతే రాజయ్యేందుకు వీలుగా విధానాలను రూపొందిస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వెనుకబాటు తనానికి మారుపేరుగా నిలిచే విజయనగరం జిల్లాకు ఆ ముద్రను చెరిపేందుకు గట్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దీని కోసం వడివడిగా అడుగులు పడుతున్నాయన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.1600 కోట్ల ధాన్యం బకాయిలను చెల్లించకుండా వెళ్లిపోయారని మంత్రి విమర్శించారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ రైతాంగం క్షేమమే ప్రధాన కర్తవ్యమని చంద్రబాబు భావించి ఆ బిల్లులన్నిటినీ చెల్లించారని తెలిపారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో సమృద్ధిగా అందుబాటులో ఉంచామని తెలిపారు. అన్నదాతా సుఖీభవ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.20 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతోందన్నారు. రూ.60 కోట్ల తో 50 శాతం సబ్సిడీతో రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నామని చెప్పారు. రైతు సాధికారత కింద 76,500 కిట్లు అందజేస్తున్నామని, 80 శాతం రాయితీతో డ్రోన్ పరికరాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చెరకు రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సంకిలి ఫ్యాక్టరీతో సంప్రదింపులు జరుపుతున్నామని.. ఈ ఏడాది ఆరు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ నేడు వ్యవసాయం చాలా సంక్లిష్టమైందని... రైతుల పిల్లలకు పెళ్లిళ్లు కావడం కష్టమవుతోందని విచారం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో వ్యవసాయం చేసుకునే వారి గౌరవం పెరిగేలా విధానాలు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్‌తెంటు లక్ష్మునాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ రామారావు, ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్‌పీటీసీ, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, జనసేన, బీజేపీ నాయకులు గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు, మరిశర్ల రామా రావునాయుడు తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ అందజేస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే బేబీనాయన

'జిందాల్' పనులను అడ్డుకున్న నిర్వాసితులు

- భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- పోలీసులు వచ్చినా వెనక్కి తగ్గని వైనం

శృంగవరపుకోట రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పంచాయతీ దాసులపాలెం వద్ద జిందాల్ భూముల చదును పనులను నిర్వాసితులు బుధవారం ఉదయం అడ్డుకున్నారు. అక్కడ పనిచేస్తున్న యంత్రాల డ్రైవర్ల వద్దకు వెళ్లి పనులు నిలిపివేయాలని కోరారు. కిల్తంపాలెం, ముషిడిపల్లి, పెదఖండేపల్లి నిర్వాసితులందరూ కలసి వాహనాలను బయటకు పంపారు. ఈ విషయం తెలుసుకున్న యాజమాన్య ప్రతినిధులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్‌ఐ గోవిందరావు సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వారు వినలేదు. మధ్యాహ్నం రెండు గంటల వరకు అక్కడే ఉండిపోయారు. ఈ సందర్భంగా జిందాల్ నిర్వాసితులు మాట్లాడుతూ 2008లో అప్పటి జడ్‌పీటీసీ, ఇప్పటి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తమ బతుకులు బాగుపడతాయని చెబితే వందల మంది రైతులు భూములు ఇచ్చారని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ సభలో తమ కోసం పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు కడుతుందని.. రైతులను కంపెనీలో భాగస్వాములను చేస్తున్నట్టు చెప్పిందన్నారు. 18 ఏళ్లుగా పరిశ్రమ రాకపోగా... తాము సంస్థకు భూములు ఇచ్చి కూలీలుగా మారామన్నారు. తమకు ఎకరాకు రూ.రెండు లక్షల మూడు వేలు ఇచ్చారని... ఈ మధ్య కాలంలో కొంతమందికి షేర్‌ధనం వాటా అంటూ సుమారు రెండు లక్షల వంతున ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. తాము ఇచ్చిన భూముల్లో ఇప్పుడు ఏవో పరిశ్రమలు పెడతామని చెబుతున్నారని, దీనిపై తమకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను ప్రభుత్వం గుర్తించి.. కంపెనీ వారితో సమావేశం నిర్వహించాలని కోరారు. అంతవరకు ఇక్కడ పనులు చేయనివ్వబోమని స్పష్టం చేశారు. తమకు న్యాయం చేయకపోతే రాష్ట్రపతికి లేఖ రాస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషిడిపల్లి, కిల్తంపాలెం, పెదఖండేపల్లి ప్రజాప్రతినిధులు, నిర్వాసితులు పాల్గొన్నారు.



నిర్వాసితులతో చర్చిస్తున్న పోలీసులు

నిర్వాసితులకు బాసటగా అఖిలపక్షం..

నిర్వాసితులకు బాసటగా అఖిలపక్షంతో పాటు ప్రజా, రైతు సంఘాలు నిలవబోతున్నాయి. గడిచిన కొద్దిరోజులుగా జిందాల్ నిర్వాసితులు తమకు న్యాయం చేయాలని నిరసన గళం వినిపిస్తుండడం.. ఎమ్మెల్సీ రఘురాజు నివాసాన్ని ముట్టడించడం వంటి పరిణామాల నేపథ్యంలో వీరికి అండగా ఉండేందుకు అవి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. వీటితో పాటు తాటిపూడి నీరు పూర్తి స్థాయిలో ఈ ప్రాంత ఇవ్వాలని దశాబ్దాలుగా పోరాటం నడుస్తోంది. తాటిపూడి నీరు జిందాల్‌కు కేటాయిస్తామని జీవోల్లో రావడం చూసి రైతులు భయపడుతున్నారు. నీరు పరిశ్రమలకు వెళితే తమ పంట భూములు బీడుగా మారుతాయని ఆందోళనలో ఉన్నారు. ఈ విషయమై ఈనెల 20న తాటిపూడిలో సమావేశం ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జిందాల్ నిర్వాసితుల సమస్యలపై పోరాటానికి ప్రతిపక్ష వైసీపీ సిద్ధమవుతోంది.

రహదారిపైనే వరదనీరు

- గత ఏడాదీ ఇదే పరిస్థితి
- పాడవుతున్న రోడ్డు
- వాహనచోదకులకు ఇక్కట్లు

పాలకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-సీతంపేట రహదారిపై వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మరమ్మతులకు గురవుతోంది. తోటపల్లి ఎడమ ప్రధాన కాలువకు ఇటీవల వర్షాలకు వరదనీరు వస్తోంది. కాలువ నిండుగా ప్రవహిస్తుండడంతో పట్టణ శివారు ప్రాంతాల్లోని సీఎల్‌నాయుడునగర్, ఆదిత్యనగర్ తదితర కాలనీల్లోని ఇళ్ల ప్రాంగణాల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఆ కాలనీల ద్వారా ప్రధాన రహదారి పైకి వరదనీరు అధికంగా రావడంతో అంతా ఇబ్బందులకు గురవుతున్నారు. తోటపల్లి ఎడమ కాలువను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో కాలువ గుండా సాగునీరు వెళ్లడం లేదు. కాలువ కుశించుకుపోవడంతో నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ఆయా కాలనీల మీదుగా నీరు ప్రవహించి రహదారులపైకి చేరుతుంది. దీనితో కాలనీ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి తలెత్తింది. ప్రస్తుతం పూర్తిస్థాయిలో వర్షాకాలం రాకముందే ఈ పరిస్థితి ఉంటే వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటామని అంతా ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ రహదారిని బాగుచేశారు. ఇంతలోనే ఇలా వరదనీరు ప్రవహించడంతో రహదారి మళ్లీ పాడయ్యే అవకాశముంది. నీటిపారుదల శాఖాధికారులు కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించి శివారు ప్రాంతాల కు కాలువ గుండా నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నా రు. నగర పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా సమన్వయం చేసుకుని అటు కాలనీలోకి, రహదారి మీదకు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రధాన రహదారిపై పారుతున్న వరదనీరు

ఏదీ.. ఆహ్లాదం?

●అధ్వానంగా జగదాంబనగర్ పార్కు ●పాడైన పిల్లల ఆట సామగ్రి ●పట్టించుకోని పాలకులు



తుప్పు పట్టి పాడైన జారుడుబల్ల

విజయనగరం రింగురోడ్డు, జూన్18 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని ఫూల్‌బాగ్ రోడ్డులో ఉన్న జగదాంబనగర్ పార్కు అధ్వానంగా ఉంది. పార్కు నిర్వహణను పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ నగర వాసులు, పిల్లలు అధికంగా పార్కుకు వస్తుంటారు. అయితే వారికి ఇక్కడ ఆహ్లాదం కరువవుతోంది. ఇదివరలో పార్కులో ఏర్పాటు చేసి పిల్లల ఆట సామగ్రిలో కొన్ని తుప్పు పట్టి పాడయ్యాయి. మరికొన్ని విరిగి మూలకు చేరాయి. ఈ పార్కును గతంలో జగదాంబనగర్ కల్చరల్ అసోసియేషన్ అభివృద్ధి చేసింది. స్థానికులు, వాకర్స్ సహకారంతో పార్కులో మొక్కల పెంపకం, సిమెంట్ బల్లలను అసోసియేషన్ ఏర్పాటు చేయించింది. అయితే పార్కులో పిల్లల కోసం ఆట సామగ్రి, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని అసోసియేషన్ సభ్యులు పదేళ్లగా పాలకుల ను కోరుతున్నా ఎవరూ పట్టించుకునే దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, గత ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, నగరపాలక సంస్థ మేయర్‌లకు వినతిపత్రాలు అందజేసినా కనీస చర్యల్లేవనేది అసోసియేషన్ మాట. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్యకు అసోసియేషన్ సభ్యులు పార్కును అభివృద్ధి చేయాలని వినతిపత్రం సమర్పించారు. కొద్దిరోజుల కిందట పార్కులో గేటు ప్రారంభోత్సవానికి వచ్చిన నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు కు కూడా వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాల్సి ఉంది.



విరిగిపడి మూలకు చేరిన ఆట సామగ్రి

ఆదాయం పెంచండి

విజయనగరం కలెక్టరేట్, జూన్18 (ఆంధ్ర జ్యోతి): జీఎస్టీ చెల్లించడం ద్వారా జిల్లా ఆదాయం పెంచడానికి కృషి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చేరితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో నున్న ఎంఎస్‌ఎంఈల వివరాలు, కొత్తగా స్థాపించిన పరిశ్రమలు వివరాలను పరిశ్రమల శాఖ.. జీఎస్టీ కార్యాలయానికి అందజేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన వాణిజ్య సముదాయాల వివరాలను మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలోని డీఆర్వో శ్రీనివాసమూర్తి, జీఎస్టీ అధికారులు ఉన్నారు.

ప్రతీ రైతుకు విత్తనాలు అందాలి

లక్కవరపుకోట, జూన్18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రతీ రైతుకు విత్తనాలు అందాలని వ్యవసాయాధికారులను ఎమ్మెల్యే లలితకుమారి ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో రైతులకు ఆమె రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, ఖాసాపేట సర్పంచ్ కోల్ల భూపాల్‌నాయుడు, రమణమూర్తిపాల్గొన్నారు.

గిట్టుబాటు వేతనం పొందండి

రాజాం, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం వేతనదారులు ప్రణాళికబద్ధంగా పనిచేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని వీఆర్ అగ్రహారంలో చేపడుతున్న చెరువు పనులను ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను సరిచూశారు. రెండు పూటలా పనికి హాజరుకావాలని వేతనదారులకు ఆయన సూచించారు.

యోగాతో వ్యాధుల దూరం

గంట్యాడ, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగా వ్యాధులను దూరం చేసి జీవితాలను సుఖమయం చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని కొటా రుబిల్లి కూడలిలో గల టీటీడీ కల్యాణ మం డపంలో యోగాంధ్ర సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాంధ్ర నిర్వహణ ద్వారా ప్రపంచమంతా మనవైపు చూస్తోందన్నారు. అంతకు ముందు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించే అవకాశం మన రాష్ట్రానికి రావడం చాలా గర్వకారణమన్నారు. సమావేశంలో ఆర్డీవో సవరమ్మ, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తదితరులున్నారు.

కార్మికులకు పథకాలు అమలు చేయండి

రాజాం, జూన్18 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మునిసిపల్ మేనేజరు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయుకులు పి.రాజేశ్, చిన్నబాబు, ఎన్.దుర్గాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకోండి

గుర్ల, జూన్18 (ఆంధ్రజ్యోతి):పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిని శిక్షించాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులను గుజ్జంగివలసలో బుధవారం మధ్యాహ్నం ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు గో సంరక్షణ సమాఖ్య జిల్లా న్యాయ సలహాదారు డాక్టర్ పాక నాగమల్లికరాణి, జిల్లా కార్యదర్శి మద్దిల శ్యామ్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, ఝాన్సీ, జిల్లా కమిటీ సభ్యులు గొల్లపూడి పృథ్వీరాజ్, వేమలి యమున, లోగిశ సురేష్, హెచ్‌సీ రమణరావు ఉన్నారు.

చిరంజీవి పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, జూన్18 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి కీర్తి మెగాస్టార్ చిరంజీవి అని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో మరుపురాని పాత్రల్లో చిరంజీవి నటించి మెప్పించారని కొనియాడారు. సేవా కార్యక్రమాల్లోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. అభిమాన సంఘ ప్రతినిధులు చక్రవర్తి, రాంకీ, హుస్సేన్ ఖాన్, రాజేశ్, అప్పలనాయుడు, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో విశాఖ పేరుండాలి

●బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

లక్కవరపుకోట, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం ద్వారా విశాఖ పేరు గిన్నిస్ బుక్‌లో నమోదు సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం ఆమె ఎల్.కోటలో పర్యటించారు. ఎమ్మెల్యే లలితకుమారి నివాసంలో నిర్వహించిన యోగాంధ్ర సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో జూన్ 21న విశాఖ బీచ్‌రోడ్డులో ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని మోడీ పాల్గొంటున్న కార్యక్రమాన్ని అందరం విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 5 వేల మంది విశాఖ వెళ్తున్నారన్నారు. అందులో విద్యార్థులు కూడా ఉన్నారన్నారు. అధికారులలు సమన్వయంతో పనిచేసి యోగాంధ్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇ.నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కేబీఏ రాంప్రసాద్, ఇందుకూరి సుధారాణి, కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, జీఎస్ నాయుడు, కొల్లు రమణమూర్తి, మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల సృష్టికర్త ఎన్టీఆర్...

●లక్కవరపుకోట: రాష్ట్రంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం ఆమె మండలంలోని జమ్మాదేవిపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే లలితకుమారితో కలిసి ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం అందరికీ అందిందా, లేదా అని ఆరా తీశారు. ఇక్కడి విద్యార్థులు పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ పాత్రోను మంత్రి అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యేతో కలిసి బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, మాకేన సీతారామపాత్రుడు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సౌకర్యాలు కల్పిస్తాం



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నెల్లిమర్ల, జూన్18 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని టిడ్కో కాలనీలో అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు బుధవారం కాలనీలో ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించిన తర్వాత లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తామన్నారు. పట్టణం నుంచి కాలనీ వరకు ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డును బీటీ రహదారిగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ తారక్‌నాథ్, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, గంటా సత్యనారాయణ, అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, పతివాడ గోవిందరావు, గదుల అచ్చిన్నాయుడు, పలిశెట్టి దొరబాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, ఈఈ త్రినాథరావు, ఏఈ పిచ్చయ్య పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

●నెల్లిమర్ల: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని సీతారాముడిపేటలో బుధవారం రాయితీపై విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఆధునిక యంత్రాలు, శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచించారు. యువత వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. చీపురుపల్లిలో మైనింగ్ వల్ల కాలువల ద్వారా సాగునీరు రావడానికి అడ్డంకి ఏర్పడిందని ఎమ్మెల్యే వివరించారు. ఆ సమస్య త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఏడీఏ ఎస్.కోటేశ్వరరావు, విజయనగరం ఏడీఏ బి.నాగభూషణ్, ఏవోలు పి.శ్రీలక్ష్మి, సంగీత, ఏఈవో నాగరాజు, రాంబార్కి రామారావు, చనమల్లు వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, గంటా సత్యనారాయణ, కరుమజ్జి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడిని పెంచుకోండి



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వినియోగించుకుని రైతులు పంట దిగుబడి పెంచుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. బుధవారం మండలంలోని బొడ్డవరలో ఆయన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాత పద్ధతుల్లో ఎకరాకు 20 బస్తాలకు మించి పండించడం లేదని సాగులో కొత్త పద్ధతుల ద్వారా 30 బస్తాలు పండించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మీన, ఉప సర్పంచ్ ఆడారి అప్పారావు, గ్రామపెద్దలు మురళీరాజు, శ్రీనివాసరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బలోపేతానికి చర్యలు

●చైర్మన్ కిమిడి నాగార్జున



మాట్లాడుతున్న చైర్మన్ నాగార్జున

విజయనగరం రూరల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బలోపేతానికి పరస్పర సహకారంతో ముందుకు సాగుదామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జిల్లాలోని బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 25 నాటికి బ్యాంకులోని రూ.316 కోట్ల డిపాజిట్లను రూ400 కోట్లకు పెంచేందుకు, అలాగే రూ.2,150 కోట్లుగా ఉన్న బ్యాంకు వ్యాపార లావాదేవీలను 2,500 కోట్లకు పెంచాలని లక్ష్యం నిర్ణయించామన్నారు. పీఏసీఎస్‌ల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో సీహెచ్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌ను కలిసిన భవిరెడ్డి

డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జునను బుధవారం ఆయన కార్యాలయంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి ఆర్థికంగా చేయూతను అందించాలని రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాలకృష్ణ, కంది సీతారాం, బూర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత కమిటీల నియామకం పూర్తి



మాట్లాడుతున్న రామ్‌మల్లిక్ నాయుడు

చీపురుపల్లి, జూన్18 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిబంధనల మేరకు నియోజకవర్గంలో సంస్థాగత కమిటీల నియామకం పూర్తి చేశామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. మిగిలినవి కూడా త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే బూత్, కుటుంబ సాధికార, క్లస్టర్, యూనిట్ స్థాయిల్లో కమిటీల నియామకం పూర్తి చేశామన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు సవలపురపు వెంకటరమణ మాదిగ, గండురేతు గోవిందరావు, లక్ష్మీవరప్రసాద్, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, మహంతి అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్, కలిశెట్టి సత్యనారాయణ, చల్లా శ్రీరామ్, దన్నాన సూరపునాయుడు, బెవర పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

చీపురుపల్లి, జూన్18 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు బుధవారం పరిశీలించారు. అమృత్ భారత్ కింద రూ.14 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్టేషన్ ఆధునీకరణ, ప్లాట్‌ఫాంల నిర్మాణం, ప్రయాణికుల షెల్టర్ల నిడివి పెంపు, అదనంగా మరో ఫ్లైఓవర్ నిర్మాణం తదితర పనులను అధికారులు పరిశీలించారు. పరిశీలనలో సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, డీఎస్‌టీఈ విజయ్ సైనీ, డీఈఈ అశోక్‌కుమార్, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాజాం, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా గురువు వేమకోటి గిరిబాబు అన్నారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని గాయత్రి కాలనీలో ఓ ప్రైవేట్ పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు, పట్టణ పార్టీ ప్రెసిడెంట్ జొన్నాడ రంజిత్, చల్లా అజయ్‌కుమార్, గుడివాడ నాగరాజు, సిహెచ్.సత్యనారాయణ, సామంతుల రమణనాయుడు, పి.వైకుంఠ, మహిళా మోర్చా నాయకురాలు శారద, పెద్దింటి శ్రీదేవి, జనసేన నాయకుడు దత్తి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయండి

చీపురుపల్లి, జూన్18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముఖ్య నగరాలు, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనను అనుసరించి అన్ని ప్రదేశాల్లో కఠినంగా అమలయ్యే విధంగా చూడాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగం గతంలో కంటే పట్టణాలతో బాటు పల్లెల్లో కూడా గణనీయంగా పెరిగిపోయిందన్నారు. ఎన్నిసార్లు నిషేధం విధించినా, అధికారుల నిర్లక్ష్యం వల్ల అమలు కావడం లేదన్నారు. దీనిపై ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రజల సహకారం లేనిదే ప్లాస్టిక్ నివారణ సాధ్యం కాదన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై సభ్యుల ధ్వజం

వంగర, జూన్18, (ఆంధ్రజ్యోతి): మండల సమావేశాల్లో తరచూ చెబుతున్నప్పటికీ రెవెన్యూ సిబ్బందిలో మార్పు లేకుందని సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో రెవెన్యూ శాఖపై నిర్వహించిన సమీక్షలో సంబంధిత సిబ్బంది పనితీరుపై సభ్యులు మండిపడ్డారు. పనికి ఒక రేటుతో ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు సైతం సభ్యులకు వంత పాడారు. రెవెన్యూ సిబ్బంది పని తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ చర్చలో వ్యవసాయధికారి కన్నబాబు మాట్లాడుతుండగా పలువురు సర్పంచ్‌లు అడ్డుతగిలారు. విత్తనాలు అందించటంలో నిర్లక్ష్యం వహించడమేంటని గీతనాపల్లి, తలగాం సర్పంచ్‌లు నిలదీశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ

వైద్యుల నిర్లక్ష్యం.. బాలింత మృతి

●ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన
●డాక్టర్, సిబ్బందిపై చర్యలకు డిమాండ్
●పాతికేళ్లకే ప్రాణాలు కోల్పోయిన మహిళ



రోదిస్తున్న మృతురాలి భర్త మునలినాయుడు

రాజాం రూరల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): పట్టుమని పాతికేళ్లు కూడా నిండని ఆ బాలింత పుట్టిన బిడ్డను కళ్లారా చూడకుండానే ప్రాణాలు కోల్పోయింది. పొత్తిళ్లలో ఉండాల్సిన ఆ చిన్నారిని వీడి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. ఇప్పటికే ఓ కొడుకుని కంటికి రెప్పలా చూసుకుంటున్న ఆ తల్లికి రెండో కాన్పులో కూడా కొడుకే పుట్టాడన్న ఆనందం ఎంతోసేపు నిలవలేదు. కడసారిగా కొడుకుని చూడకుండానే కానరాని లోకాలకు వెళ్లిపోయిందా తల్లి. ఇద్దరు కొడుకులు పుట్టారన్న ఆనందం ఆ తండ్రికి కొద్దిసేపూ మిగల్లేదు. క్షేమంగా ప్రసవం జరుగుతుందని వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పిస్తే.. సంతోషం మాటలా ఉంచితే ఇంటిళ్లపాది దుఃఖ సాగరంలో ముంచేశారా వైద్యులు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే తమ బిడ్డ ప్రాణాలు తీశారని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ ఘటన వైసీపీ నియోజకవర్గ నాయకుడికి చెందిన ఆసుపత్రిలో బుధవారం చోటుచేసుకుంది. వారి వివరాల మేరకు.. రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన వావిలపల్లి రుష్మిత (25) రెండో కాన్పు కోసం రాజాంలోని సన్‌రైజ్ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి వర్గాల సూచనల మేరకు స్పెషల్ రూం తీసుకుని అందుకు అవసరమైన మొత్తాన్ని చెల్లించారు. ఈనెల 17న మృతురాలు రుష్మితకు సర్జరీ చేశారు. పండంటి మగబిడ్డను కన్న రుష్మిత ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇంతలో రుష్మితకు యూరిన్ ప్రసరణ నిలిచిపోయింది. ఫలితంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతూ భర్త మునిలినాయుడు, కుటుంబ సభ్యులకు చెప్పారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు వైద్యులు సిబ్బందికి పలుమార్లు చెప్పినా సిబ్బంది నుంచి ఎలాంటి చర్యలు చేపట్టలేదని భర్త మునలినాయుడు తెలిపారు. దీంతో తన భార్య రుష్మిత ప్రాణాలు కోల్పోయిందని, తన మృతికి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందే కారణమని ఆయన ఆరోపించారు. విషయం తెలుసుకున్న బూరాడ వాసులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలంటూ వారు నినాదాలు చేశారు.

రంగంలోకి దిగిన వైసీపీ వర్గాలు

ఘటన జరిగిన అనంతరం వైసీపీ శ్రేణులు రంగంలోకి దిగాయి. తమ గ్రామానికి చెందిన మహిళ మృతి చెందిందన్న కనీస విజ్ఞత లేకుండా అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు రంగంలోకి దిగారు. ఆయనకు అండగా వంగర, రేగిడి, రాజాం, సంతకవిటి మండలాల నుంచి పలువురు నాయకులు ఆసుపత్రికి చేరుకుని రాజీమార్గాలకు శ్రీకారం చుట్టారు. మృతురాలి కుటుంబానికి ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులుపుకుందామన్న ప్రయత్నాలను కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. దీంతో తేలుకుట్టిన దొంగలా వైసీపీ నేతలు మౌనం ప్రదర్శించారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కూడా మృతురాలి బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం మార్మోగింది.

కంటి ఆపరేషన్ భయంతో..

● బాలుడి ఆత్మహత్య

సాలూరు, జూన్18 (ఆంధ్రజ్యోతి): కంటి ఆపరేషన్ చేయించుకోవాల్సి వస్తుందేమోననే భయంతో ఓ బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన బంజారా మహావీర్(17) కొంతకాలంగా పట్టణంలో తన బంధువుల వద్ద ఉంటున్నాడు. తన కళ్లకు చిన్నపాటి ఇబ్బంది ఉండటంతో ఈనెల 17న నేత్ర వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. సదరు వైద్యుడు కళ్లకు ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. కళ్లకు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందన్న భయంతో బుధవారం తాను నివాసం ఉన్న ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. విషయం గ్రహించిన బంధువులు వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

● ప్రధాన రహదారిపై రాస్తారోకో



నిరసన తెలుపుతున్న మహిళలు

నెల్లిమర్ల, జూన్18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని మహిళలు తాగునీటి కోసం బుధవారం రోడ్డెక్కారు. విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పట్టణంలోని 6, 7, 8, 9, 10 వార్డులకు తాగునీరు అందించే పైప్‌లైన్ 25 రోజుల కిందట మరమ్మతుకు గురైంది. అప్పటి నుంచి కుళాయిల నుంచి వారికి తాగునీరు సరఫరా కావడంలేదు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో బుధవారం ఖాళీ బిందెలతో మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కమిషనర్, పాలక వర్గానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన రహదారిపై కొంతసేపు రాస్తారోకో చేశారు. దాంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది.

22 నుంచి నిరవధిక సమ్మె

రాజాం రూరల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు మునిసిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది వెల్లడించారు. బుధవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు రామ్మూర్తినాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్‌తో కలిసి మునిసిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ.. మునిసిపాలిటీలలో మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 43 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో నిరసన చేపడుతున్నారన్నారు. అయితే చర్చల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేసింది తప్ప సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ మునిసిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి వర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల కార్మికుల కుటుంబాలలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మెతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగినా ప్రభుత్వానిదే బాధ్యతని ఆయన అన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

గజపతినగరం, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నగదు పోగొట్టుకున్న మహిళ పోలీసులను ఆశ్రయించడంతో వారు స్పందించారు. విచారణ వేగవంతం చేసి ఆ నగదును ఆమెను అప్పగించారు. ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నివాసం ఉంటున్న పార్వతి మంగళవారం గజపతినగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లేందుకు ఆటోను ఆశ్రయించింది. స్కూల్ భోజన సమయంలో బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు రూ.30 వేలను పర్సులో పట్టుకుంది. అయితే ఆటో దిగిన సమయంలో పర్సు మరిచిపోయింది. స్కూల్‌కు వెళ్లిన తర్వాత పర్సును పోగొట్టుకున్నట్టు గుర్తించింది. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో అప్రమత్తమైన పోలీసులు బుధవారం సంబంధిత ఆటోను గుర్తించి, పర్సును బుధవారం ఆమెకు అప్పగించారు. దీంతో బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఆదిలోనే ఆటంకాలు

(5వ పేజీ తరువాయి)

సుమారు 1,899 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. 5వేల వరకు పీఎండీఎస్ కిట్లను సిద్ధం చేశారు. 30 వేల ఎకరాల్లో వరి పొలం గట్లపై కంది సాగుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

● జిల్లాలో ఖరీఫ్‌కు అవసరమైన సుమారు 45,277 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేశారు. రైతుసేవా కేంద్రాలతో పాటు హోల్‌సేల్ షాపుల్లో 118 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ పరిధిలో 3,255 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల దుకాణాలకు 5,939 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌లకు 127 మెట్రిక్ టన్నులు, ఆర్ఎస్‌కేల పరిధిలో 769 మెట్నిక్ టన్నులను అందుబాటులో ఉంచారు.

విత్తనాలు జల్లలేకపోయాం

మృగశిర కార్తెలో విత్తనాలు జల్లితే అధిక దిగుబడి వస్తుందని మా విశ్వాసం. అయితే ఈ ఏడాది అధిక వర్షాలతో వరి విత్తనాలు జల్లలేకపోయాం. నారు మడుల్లో కలుపు, భూములు పదును ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వచ్చే ఆరుద్ర, పునర్వసు కార్తెల్లో అయినా విత్తనాలు జల్లే అవకాశం కలుగుతుందో లేదోనని మదనపడుతున్నాం.

- కనపాక అప్పలనాయుడు, రైతు, ఓని

చెరువులను తలపిస్తున్న పొలాలు

అధిక వర్షాలతో పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి. ఖరీఫ్ పనులు ముందుకు సాగడం లేదు. ఇదే వాతావరణం కొనసాగితే పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. రైతులకు ఈ ఏడాదీ ఖరీఫ్ కష్టాలు తప్పేటట్టు లేవు.

- కోట రామినాయుడు, గుడివాడ

రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు

ఖరీఫ్ రైతులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాం. ఎరువులు, విత్తనాలను రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేశాం. రాయితీపై పూర్తిస్థాయిలో రైతులకు వాటిని అందిస్తాం. ప్రకృతి వ్యవసాయంతో పాటు పాటు మిల్లెట్ల సాగును ప్రోత్సహిస్తున్నాం. రాయితీతో కూడిన వ్యవసాయ సామగ్రిని అందించనున్నాం.

- కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో మెరిసిన మన్యం

(5వ పేజీ తరువాయి)

పాటల పోటీల్లో పి.భాగ్యరాధ, షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో కె.జనార్ధనరావులు ప్రథమస్థానంలో నిలిచారు.

● 35 సంవత్సరాల పైబడిన వారికి నిర్వహించిన యోగా పోటీల్లో వైకైలాసరావు ద్వితీయ స్థానం దక్కించు కున్నారు. ఆయనకు రూ. 30 వేలు నగదు బబహుమతి అందించారు. 25 సంవత్సరాలు పైబడిన వారికి నిర్వహించిన యోగా గ్రూప్ పోటీల్లో అనిల్‌కుమార్‌శర్మకు ద్వితీయ బహుమతి లభించింది.

●19 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న వారికి నిర్వహించిన యోగా, వ్యాసరచన పోటీల్లో కె.శిరీష్‌కు రా ష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి లభించింది. షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో ఎం.ఇంద్రాని, గ్రూప్ యోగా పోటీల్లో జిల్లాకు చెందిన సూర్య కాంతి బృందం మూడో స్థానం దక్కించుకున్నారు. యోగా పోస్టర్ జూనియర్ విభాగంలో కె.హేమమాలిని, యోగా స్కిట్ రోల్‌ప్లేడ్‌లో డి.దినేష్‌కుమార్ బృందం తృతీయ బహుమతి పొందారు.

సాగు పరికరాలు రైతులందరికీ ఉపయోగపడాలి

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. వచ్చే నెల 31వ తేఈ వరకు డయేరియా నివారణపై విస్తృతంగా అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు ఆ వ్యాధితో మృత్యువాతపడరాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల వద్ద ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు అందుబాటులో ఉంచాలన్నారు. డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, ఎం.వినోద్‌కుమార్, డీఈవో బి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాధి నివారణపై పోస్టర్లు విడుదల చేశారు.

50వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

బొబ్బిలి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసర మైన 50వేల క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్టు వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారా వు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు చాలా ఆశాజనకంగా ఉండడంతో రైతులంతా ఉత్సాహంగా సాగుకు సన్నద్ధమ వుతున్నారన్నారు. 40వేల క్వింటాళ్ల విత్తనాల ను రైతు సేవా కేంద్రాలకు తరలించామని చెప్పారు. పంటల సాగుకు సంబంధించి వ్యవ సాయశాఖ అన్ని విధాలుగా రైతులకు భరోసాగా సేవలందిస్తుందని ఆయన తెలిపారు.

పైపులైన్ల లీకేజీ

● తాగునీరు వృథా



ఆస్పత్రి రహదారిలో పైప్‌లైన్ లీకేజీతో మురికి గుంతలా మారిన దృశ్యం

పార్వతీపురంటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యో తి): పార్వతీపురం మున్సిపాల్టీలో ఇప్పటికే తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతోపాటు ప్రధాన పైప్‌లైన్‌తో పాటు లింకు పైప్‌లైన్లకు ఎక్కడపడితే అక్కడ లీకులు పడుతున్నాయి. దీంతో తాగునీరు వృథా అవుతోంది. అలాగే కలుషితం అవుతోంది. వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నందున ప్రధాన, లింకుపైప్‌ల మరమ్మతులు చేపట్టి శుద్ధనీటిని సరఫరా చేయాలని అయా వార్డులవాసులు ఇంజనీరింగ్ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం డీఈ శ్రీనివాసరాజును వివరణ కోరగా లీకుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. సమ్మెలో ఉన్న కార్మికులు పూర్తిస్థాయిలో విధుల్లోకి వస్తే ఆ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి పంటలతో ఆర్థికాభివృద్ధి

గరుగుబిల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పంటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని గిజబ, దత్తివలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అమలు చేస్తున్న ప్రకృతి విధానాలను ఒడిశా ప్రాంతంలో అమలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారని చెప్పారు. పంట దిగుబడికి ఎకరాకు 25 నుంచి 30 కిలోల నవధాన్యాలు వేసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ దినేష్, ఎస్ఎఫ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

సారాకు దూరంగా ఉండాలి

గరుగుబిల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు సారాకు దూరంగా ఉండాలని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి కోరారు. పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేటలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సారా అమ్మకాలు చేసినా, తయారు చేసినా సమాచారం అందించాలన్నారు. మద్యం దుకాణదారులు నిబంధనలు ధిక్కరించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జె.తిరుపతిరావు, ఎస్ఐ షరీఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే..

● పాఠశాలల ఆవరణలో అధ్వాన పరిస్థితి

● కాలువలో పేరుకుపోతున్న మురుగు

● పట్టించుకోని అధికారులు

భామిని, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రహరీ పక్కనే ఉన్న కాలువల్లో మురుగు పేరుకుపోతోంది. విద్యార్థులు ముక్కు మూసుకుని బడికి వెళ్లాల్సి వస్తోంది. దుర్వాసన వస్తుందని తల్లిదండ్రులు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. భామిని, బాలేరు ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ప్రహరీల సమీపంలో రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించారు. అయితే ఆ నీరు, వర్షపునీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో దుర్వాసన వస్తుంది. భామిని పాఠశాల ప్రహరీకి ఆనుకుని మురుగు కాలువ ఉన్నప్పటికీ ఆ మురుగు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. పూడికలు తొలగించకపోవడంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి సంబంధిత మండల పరిషత్, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులకు సరైన మార్గదర్శకాలు చేయకపోవడం, ఆ సమస్య పరిష్కారం కాకున్నా విద్యార్థులపైన ప్రభావం పడుతుంది. ఇన్నాళ్లు పాఠశాలలకు సెలవులు కావడంతో ఈ సమస్య ఎవరి దృష్టికి రాలేదు. గత నెల 12వ తేదీ నుంచి పాఠశాలలకు తెరవడంతో మురుగు మీద నుంచే విద్యార్థులు వెళ్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టి సారించి మురుగు కాలువ నీటిని యుద్ధ ప్రాతిపదికన తరలించే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

దీనిపై బాలేరు పంచాయతీ కార్యదర్శి ఎస్.సూరయ్య వద్ద ప్రస్తావించగా వాడుక నీరు నిల్వ ఉండడం వాస్తవమేనని చెప్పారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పాఠశాల ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చామని, గ్రామ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లామని తెలిపారు. వారితో సంప్రదించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



భామిని ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ పక్కన పేరుకుపోయిన మురుగు

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకార ఉత్సవాన్ని సాలూరులోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ క్యాంపు కార్యాలయం నుంచి కార్యక్రమ స్థలం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్‌గా ముఖీ సూర్యనారాయణ, వైస్ ఛైర్మన్‌గా మింది సింహాచలంతోపాటు పాలకవర్గ సభ్యులందరితో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత పాలకవర్గానికి ఉందని ఆమె తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పీ.భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), గుళ్ల వేణుగోపాలనాయుడు, ఆముదాల పరమేశు, వెంకటరమణ, గూడెపు యుగంధర్‌తోపాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆనకట్ట కాలువలో పూడికతీత



కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

సీతానగరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీతానగరం ఆనకట్ట కాలువలో గత ఆరేళ్ల నుంచి కనీసం పూడికలు తొలగించలేదు. దీంతో శివారు గ్రామాలకు నీరందడం లేదని రైతులు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాలతో ఆనకట్ట ఛైర్మన్ తెంటు వెంకట అప్పలనాయుడు బుధవారం పూడికలు తొలగింపు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మొత్తం ఆనకట్ట కాలువ 12.5 కిలో మీటర్ల మేర పూడికలు తొలగిస్తున్నారు. వైస్ ఛైర్మన్ ఎం.రమేష్, టీసీలతో పాటు రైతులు శేఖర్, శంకరరావు, జగన్నాథం పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

సీతంపేట రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ కేంద్రంలో ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ సంస్థకు చెందిన వారితో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆ రోజున ఉదయం 9 గంటలకు పూర్తి బయోడేటా, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోతో పాటు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, మోటార్ వెహికిల్, మెకానిక్ ట్రేడులలో ప్రస్తుతం చివరి ఏడాది చదువుతున్న, ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 9493817472, 9491134464 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పూర్తిస్థాయిలో విద్యామిత్ర కిట్లు

గరుగుబిల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 పంచాయతీల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లును పూర్తిస్థాయిలో సరఫరా చేశామని ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3,008 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్ట్ బుక్స్‌తో పాటు బ్యాగ్‌లు, బెల్టులు, బూట్లుతో పాటు రెండు జతల డిక్షనరీలను సరఫరా చేశామని చెప్పారు. యూనిఫారం రావాల్సి ఉందన్నారు. మండలంలో 43 మంది ఉపాధ్యాయులకు బదిలీ అయిందని, మరో 31 మంది మండలంలో పాఠశాలలకు కేటాయించారన్నారు. మండలంలోని ఒక ఉపాధ్యాయినికి పదోన్నతి లభించిందన్నారు. తొమ్మిది మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా విభజన చెందాయని వివరించారు. పలు పాఠశాలల భవన స్థితిపై ప్రభుత్వ విప్ జగదీశ్వరి దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు.

అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కురుపాంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లకు నిధులు మంజూరు చేసి, టెండర్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాయం సమీపంలో కోర్టు, హౌసింగ్ కార్యాలయం వద్ద ఉన్న స్థలాన్ని ఆమె హౌసింగ్ శాఖ పీడీ ఆర్.వంశీకృష్ణ, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ కార్యాయాలకు దూర ప్రాంతం నుంచి వచ్చే వారికి ఉపయోగకరంగా ఉంటుందని, అందువల్ల ఇక్కడే నిర్మించాలని హౌసింగ్ పీడీ వంశీకృష్ణకు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, టీడీపీ నాయకులు కోలా చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో విద్యాంధ్రగా ఏపీ

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌ల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ విద్యాంధ్రగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయడంతో ప్రతి తల్లి కళ్లల్లో ఆనందం చూశామని చెప్పారు. మొన్నటి వరకు హేళన చేసిన వైసీపీ నాయకులకు ఇప్పుడు మాటలు రావడం లేదన్నారు. ● విశాఖపట్టణంలో ఈనెల 21న నిర్వహించే ప్రపంచ స్థాయి యోగాంధ్ర కార్యక్రమానికి నియోజక వర్గ ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోను చంటి, రౌతు వేణు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పార్వతీపురం రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆయన బుధవారం నర్సిపురం పంచాయతీ పరిధిలో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. పార్వతీపురం పట్టణంతో పాటు బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలకు చెందిన పలువురు వచ్చి తమ సమస్యలను విన్నవించారు. సీసీ రహదారులు, రేషన్‌కార్డులు, పింఛన్లు తదితర వాటిపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందించారు. వీటిని పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

● సర్వసభ్య సమావేశంలో కోరిన సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఏవో అవినాష్

సీతానగరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బలగ రవణమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. కృష్ణరాయిపురం, రంగంపేట, కొత్తవలస గ్రామాల్లో తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందని ప్రజాప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని నిలదీశారు. తాగునీటి సమస్యపై పలువురు ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఇటువంటి సమస్య రాకుండా చూడాలని జేఈ పవన్ కుమార్‌కు సూచించారు. రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో ఒకే ఎల్‌పీఎం నెంబరు ఇద్దరు పేరున పడి ఉంటే దానిని రానున్న సర్వేలో విడదీస్తారని చెప్పారు. ఈ సమావేశం లో వెటర్నరీ, విద్యా, గృహ నిర్మాణ, అంగన్‌వాడీతో పాటు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



యోగా చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని నియోజకవర్గ ప్రజలు విజయవంతం చేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 21న విశాఖ వెళ్లేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా తన గృహంలో యోగా చేశారు. ● యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలు వేయించారు. కళాశాల పీడీ ఎస్.సీతారాం పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: యోగా దినోత్సవానికి సన్నద్ధంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో బుధవారం యోగాసనాలు వేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా చేసి, లీప్ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేశారు.

● పార్వతీపురంటౌన్: యోగాంధ్రపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆసనాలు వేశారు.

వెలుగు కార్యాలయంలో అవినీతికి అడ్డులేదా?

● ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు

● రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల వెలుగు కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని స్థానిక ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మామిడివలస ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు మడక తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో వీవోఏలు స్త్రీనిధి రుణాల్లో సభ్యుల నుంచి అదనంగా వసూళ్లు చేస్తున్నారని, చెల్లిస్తున్న అమౌంట్‌కు రశీదులు కూడా ఇవ్వడం లేద ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో వీవోఏల పనితీరు బాగోలేదని వీరిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండల సమావేశానికి ఏపీఎం గానీ, సీసీలు గానీ రాకపోవడం తీవ్రంగా పరిగణించాల్సి వస్తోందని అన్నారు. అలాగే గత ఏడాది డిసెంబర్ నెలలో వేసిన గ్రావెల్ రోడ్డుకు ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి శంకరరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూశాఖలో 5 సెంట్ల భూమి లేనివారికి కూడా ఎక్కువ భూమి ఉన్నట్టు రికార్డులు చూపిస్తున్నాయని, దీనివలన చాలా మంది ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని మామిడివలస ఎంపీటీసీ సభ్యుడు మడక తిరుపతిరావు సభ దృష్టికి తెచ్చారు. రహదారులు నిర్మించాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి పని కల్పించాలని తదితర సమస్యలను పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఏడాది పెద్దగెడ్డ ప్రాజెక్టు ద్వారా రూ.18 లక్షలతో 7 పనులు మంజూరయ్యాయని, త్వరలో ఈ పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ ఏఈ హరిబాబు తెలిపారు. మండలంలో కొన్ని పంచాయతీల్లో 46 పనులకు గానూ రూ.6 కోట్ల 33 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు. హౌసింగ్ ఏఈ మత్స వెంకటేష్ మాట్లాడుతూ ఈ ఏడాది కొత్త ఇళ్ల మంజూరుకు ఇప్పటివరకు 1360 మంది దరఖాస్తు చేసుకున్నారని, త్వరలోనే ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎస్సీ బీసీ, ఇతర కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని వార్డెన్ వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, హెచ్‌డీటీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కాంగ్రెస్ పార్టీలోకి రంజిత్‌కుమార్

పార్వతీపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు కె.రంజిత్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అరకులో బుధవారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి సమక్షంలో ఆయన ఆ పార్టీలో చేరారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 238మంది ఎంపిక

సాలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన జాబ్ మేళాలో 238మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 292 మంది హాజరు కాగా, వీరిలో 238మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని చెప్పారు. వారికి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కోట్ల శ్రీనివాసరావు చేతులమీదుగా ఆఫర్ లెటర్లు అందించారు.

మొండెంఖల్ ఇరిగేషన్ ఏఈగా శంకరరావు

కురుపాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మొండెంఖల్ సెక్షన్ ఇరిగేషన్ ఏఈగా బూరాడ శంకరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించినట్టు కురుపాం ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈ డి.రవికుమార్ తెలిపారు. గత ఐదేళ్లుగా మొండెంఖల్ సెక్షన్ ఏఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జితో ఇప్పటివరకు కొనసాగిందని అన్నారు. పాలకొండ ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో ఏఈగా పనిచేసిన శంకరరావు బదిలీపై మొండెంఖల్ సెక్షన్ ఏఈగా వచ్చారని చెప్పారు. ఇన్‌చార్జి జేఈ భావన... ఏఈ శంకరరావుకు బాధ్యతలు అప్పగించారు.

ఆదివాసీ గ్రామాల్లో జుగా సభలు

సీతంపేట రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో కొండాడ, చింతాడ, హడ్డుబంగి పంచాయతీల్లో జుగా గ్రామసభలు బుధవారం నిర్వహించారు. జుగా సర్వేలో భాగంగా బెన్నరాయి, చింతాడ, హడ్డుబంగి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వెనుకబడిన ఆదివాసీ గిరిజనుల అవసరాలను గుర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో బి.రామకృష్ణ మాట్లాడుతూ జుగా సర్వే వేగవంతం చేయాలని సూచించారు. ఈ గ్రామసభలో డిప్యూటీ డిఈవో జి.రామ్మోహనరావు, ఏవో వాహిణి పాల్గొన్నారు.

ఉద్యోగులకు నియామక పత్రాలు

సీతంపేట రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నాలుగో తరగతి ఉద్యోగులు 83 మందికి పొరుగు సేవల ప్రాతిపదికన నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొరల ఆధ్వర్యంలో నాలుగో తరగతి ఉద్యోగులతో ఈ ప్రక్రియను పూర్తిచేశారు. వీరితో పాటు సూపరింటెండెంట్ అప్పారావు ఉన్నారు.

బహిరంగ వేలం నేటికి వాయిదా

పాలకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగన్నాథస్వామి దేవస్థానంలో రథయాత్రను పురస్కరించుకుని వినోద కార్యక్రమాలు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేసుకునేందుకు బుధవారం నిర్వహించనున్న బహిరంగ వేలం గురువారానికి వాయిదా వేస్తున్నట్టు ఆలయ ఈవో సర్వేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారులు బుధవారం వరుస సమావేశాలు ఏర్పాటు చేయడంతో ఈనెల 19కు వేలం వేస్తామని చెప్పారు. ఈనెల 27 నుంచి జూలై 7వ తేదీ వరకు జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా జెయింట్‌వీల్స్‌తో పాటు ప్రసాదం కౌంటర్లు అమ్మడానికి ఈ వేలం వేస్తున్నట్టు తెలపారు. పాటదారులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

పార్వతీపురం రూరల్: నర్సిపురం గ్రామం వద్ద విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అప్పమ్మ అనే మహిళ మృతిచెందింది. ఈమె వయసు సుమారు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని స్థానికులు తెలిపారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.